# ఒక ఉదయం

ప్రకాశం నెమ్మదిగా నడుచుకుంటూవచ్చి ఇంట్లోకి ప్రవేశించాడు. నక్షత్రాలయితే అస్తమించాయి గాని ఇంకా తెల్లవారలేదు. దూరంగా రాబందులు అప్పుడే నిద్దరలేచి ఉత్సాహంగా అరుస్తున్నాయి. గాలి దిక్కుతోచనట్లు బరువుగా వీస్తోంది.

ప్రకాశం ఒక్కొక్క మెట్టెక్కి మేడపైకి చేరుకున్నాడు. అతనికి మెదడు నిండా ఏదో బరువైన వస్తువు-చీకటి లాంటిది-నిండినట్లుంది. అతని బాల్య స్నేహితుడు శంకరం ఒకగంట క్రితమే చచ్చిపోయాడు. ప్రకాశం ఇప్పుడు తిరిగి వస్తున్నది ఆ శంకరం ఇంటిదగ్గర్నుంచే.

ప్రకాశానికి ఆ విచారంతో మేలుకుని ఉండడం ఇష్టంలేదు. ఈ మేడమీంచి చేస్తే శంకరం ఇంటివాకిలి కనిపిస్తుంది. అక్కడ వాళ్ళు శంకరాన్ని ఆఖరి ప్రయాణానికి సిద్ధం చేస్తున్నారు. 'శంకరం చచ్చిపోయాడు' అనుకున్నాడు ప్రకాశం.

శంకరానికి నలభై ఐదేళ్లు. తనకన్న రెండేళ్ళే పెద్ద. శంకరం చచ్చిపోయాడు-తన చేతుల్లోనే. తన ప్రాణస్నేహితుడు! రాత్రి రెండుగంటలకి తనకి కబురొచ్చింది శంకరానికి ప్రమాదంగా ఉందని. ఆ చీకట్లో శంకరం కొడుకు దీపం చూపిస్తుండగా నడుస్తుంటే తను రెండు సార్లు తూలి ముందుకు పడబోయాడు. కాళ్లు ఒణుకుతున్నాయి. అడుగు పడవలసినచోట పడటం లేదు...తరవాత ఆ దృశ్యం అంతా ఒక్కసారి అతనికి గుర్తొచ్చింది. అతను తట్టుకోలేక పోయాడు. "నేనిప్పుడు ఆలోచించలేను. నాశక్తికి మించినపని" అనుకుని నిద్రపోవాలని మంచంమీద పడుకున్నాడు. తనకిప్పుడు నిద్రకావాలి. నిద్ర, నిద్రపోవాలి.

కళ్లు మూసుకున్నాడు. శంకరం చచ్చిపోయాడు. టైఫాయిడ్, రెండుసార్లు తిరగబెట్టింది. ఇంక నెమ్మదిస్తుందనుకున్నారు. నిన్ననేగా తనువెళ్ళి శంకరంతో మాట్లాడతా! శంకరం ఎంత హుషారుగా మాట్లాడాడు! నలభై రోజులు అలా పడుకుని ఉండడం. వాడికి విసిగెత్తి పోయిందిట. "జ్వరం కాస్త తగ్గగానే రిక్షాలో ఊరంతా తిరిగేస్తా, డాక్టర్ వీల్లేదన్నా సరే. ఊరు చూడక పిచ్చెత్తి పోతోందిరా" అన్నాడు శంకరం.

శంకరం పెద్దవాళ్ళలో కలిసిపోయాడు. చచ్చిపోడం ఎంతసులభం...అతను నెమ్మదిగా లేచి కూర్చున్నాడు. గదినిండా నీడలు, రాత్రి తగ్గించి ఉంచిన కోడిగుడ్డు దీపం పాలిపోయినట్లుంది. ప్రక్కనే మంచంమీద ఉష నిద్రపోతోంది. ఉషకి ముప్పైఎనిమిది వెళ్లి ముప్పై తొమ్మిది వస్తుంది వచ్చేనెలలో. ఉష నిద్దరోతోంది. డాబామీద తమపిల్లలు నిద్దరోతున్నారు. పెద్దవాడికి

పందొమ్మి దేళ్ళు నిండుతాయి. రెండునెలల్లో....తనికి నలభై మూడేళ్లు. తను పెద్దవాడై పోతున్నాడు.

అతనికి గుండె ఝల్లుమంది. తరవాత గుండె దడదడా కొట్టేసుకుంది. భయం. శంకరాన్ని మోసేస్తున్నారు కాబోలు-బాజా మోగుతోంది.

చావంటే ఎందుకు భయపడాలి? అతనికి జవాబు దొరకలేదు. తను కాలేజీ కుర్రాళ్లకి "షేక్ స్పియర్" నాటకాలు అర్థం చేసుకోడం నేర్పుతాడు. వాటిలో చావు బోలెడు చోట కనిపిస్తుంది. ఒక్క చావైనాలేని ఇంగ్లీషు నవలలు తను చదివిన గుర్తులేదు. ఒకటైనా చావు కబురులేని వార్తాపత్రిక తను చూడలేదు. తను అప్పుడు చావంటే భయపడ్డాడా? లేదు. బొత్తిగా భయపడ లేదు. ఇప్పుడెందుకింత భయం? శంకరాన్ని తీసుకుపోతున్నారు. వాడి కుటుంబం మళ్ళీ ఒక్కసారి గొల్లుమంది. శంకరానికి ఇప్పుడు ఎవరెంత గట్టిగా ఏడిచినా వినపడదు. శంకరం చచ్చిపోగానే తనలో పెద్ద కుదుపు కలిగింది. శంకరం కొయ్యబారి పోగానే తనకి అక్కణ్ణించి పరుగెత్తుకుని ఒచ్చేయాలనిపించింది. ఆ శవాన్ని చూస్తుంటే ఒక నిముషం క్రితం దాని పేరు "శంకరం" అని నమ్మబుద్ధి కాలేదు. తనకి ఆ జరుగుతున్నది నిజంలా తోచలేదు....

ఉష లేచి కూర్చుంది. అతన్ని చూసి నిశ్శబ్దంగా నవ్వి ఆవలించింది. అతనిలో ఏం చలనం కలగలేదు. మామూలుగా ఉన్నట్లయితే అతను ఆ చిన్ననోరు ఆవులింతతో పువ్వులా విచ్చుకోడం చూస్తూ ఒళ్ళు మరిచేవాడు. చావు బాజాలు దూరంగా వినిపిస్తున్నాయి. వల్లకాళ్ళు ఈ ఊరికి ఉత్తరంగా ఉన్నాయి. తనూ శంకరం చిన్నప్పుడు అక్కడున్న పెద్ద వేపచెట్టెక్కి దొంగతనంగా బీడీలు కాల్చేరు ఓసారి. అది ఎవరో చూసి పెద్దవాళ్లతో చెపితే...ఇప్పుడు తను పూడ్చి పెట్టే చోటుకి వాళ్లతో వెళ్లవలసింది, కాని, కాలుకదలందే. ఎక్కడేనా తూలిపడితే! తనూ పెద్దవాడై పోతున్నాడు.

అతనికి భయం వేసింది.

ఉషని చూస్తూ 'మనం పెద్ద వాళ్ళమవుతున్నాం' అన్నాడు. పుట్టెడు దిగులు ఆ మాటల రూపంలో వెళ్ళిపోయింది. ఇంక తొంభై తొమ్మిది పుట్లు మాత్రం అతని నెత్తిమీద ఉంది. ఉష విని ఊరుకుంది. ఏం మాట్లాడలేదు. అర్థం కానట్లు చూసింది.

అది అతనికి నచ్చలేదు. స్నేహితుడు చచ్చిపోయి అంత దుఃఖంలో తనుంటే ఏం పట్టించుకోకుండా కూర్చుంది ఉష. ఉష మళ్ళీ ఆవులించింది. ఉషనోరు విచ్చిన దానిమ్మ పండులా ఉంది. అది అతనికి నచ్చలేదు. ఉక్రోషం వచ్చింది. "ఉషా, శంకరం పోయాడు-తెలుసా?" నిష్ఠూరంగా మాట్లాడేడు.

ఉష తల ఆడించింది. ఆలోచిస్తూ "ఏడుపులు వినిపించాయి. ఏం చూడను? నా ఆరోగ్యం కూడా ఏం బాగాలేదు. ఎప్పుడూ ఏదో మగతగా ఉంటోంది..." అన్నది.

ప్రకాశం వింటున్నాడు, 'నేను పెద్దవాణ్ణై పోతున్నాను' అనుకుంటూ. చచ్చిపోడం ....టేబిల్ మీద అద్దంతీసి పరీక్షగా తన మొహం చూసుకున్నాడు. కొద్దిగా గడ్డం మొలిచింది. కళ్లకింద గీతలు జాగ్రత్తగా చూస్తే కనిపిస్తాయి. తలలో అక్కడక్కడా ఒక తెల్లవెంట్రుక. అద్దం

లోకి చూస్తూనే, "అదికాదు ఉషా. శంకరం చచ్చిపోయాడు" అన్నాడు. ఎందుకు అలా అన్నాడో అతనికి తెలీదు.

ఉష ఒకసారి గది అంతటా చూసింది. డాబామీద మంచాలమీద పిల్లలు నిద్రపోతున్నారు. నెమ్మదిగా "నాకు మళ్లీ నెల తప్పింది" అన్నది.

ప్రకాశం ఉలిక్కిపడ్డాడు. ఒక్కసారిగా ఇంటి కప్పుకేసి చూస్తూ తీవ్రంగా ఏదో ఆలోచించడం మొదలు పెట్టాడు.

...నిజంగా? నిజంగా! నిజం. తన ఇంట్లో మరోపాప. తన ఒంట్లోంచి మరో ప్రాణం.

అతను మళ్లీ తలదించి ఉష మొహంలోకి చూసేసరికి ఇరవై సెకన్లు పట్టింది. అతని మొహంనిండా వెలుగు పులుముకున్నట్లుంది. అతని కళ్లలోంచి పొంగుతూన్న సంతోషం బుగ్గలమీద కాలవలు గట్టింది. అతను ఇకిలిస్తున్నాడు. అది కాలేజీ కుర్రాడి నవ్వు! ఇరవై సెకండ్లలో ఎంతమార్పు! ఒక స్విచ్ ఆఫ్‌చేసి మరొకటి ఆన్ చేసినట్లే!

అతను తన మంచంమీంచి లేచి ఒచ్చి ఉష మంచంమీద ఆమె పక్కనే కూర్చున్నాడు. ఉష ఎడం అరచేతిని తన రెండు చేతుల్తో టీ కప్పేశాడు. ఉష ముంజేతిమీద ఇండుపగింజంత పుట్టుమచ్చ ఉంది. ఆ తేనె రంగు చేతిమీద పట్టుగుడ్డలా మెరుస్తుందది. ఉష లేచి నిలుచుంది. కొద్దిగా కోప్పడింది. "ఊ వదలండి మరీ చిన్నపిల్లలై పోతున్నారు" అంది. ప్రకాశం "ఏయ్ 'పిల్లా' వెళ్తే వెళ్లావు కాని ఆజెడ ముందుకు వేసుకుని మరీ వెళ్లు" అన్నాడు ఉష మెట్లు దిగుతుంటే.

"ఏయ్ పిల్లా!" అతనికి నవ్వు పొంగి వచ్చింది. "మరీ చిన్నవాణ్ణై పోతున్నాను. ఉహుహు" అని నవ్వేశాడు. ఆనవ్వు నిద్దట్లో విని పిల్లలందరూ లేచి కూర్చున్నారు.

(ఆంధ్రపత్రిక; వీక్లీ, 16-7-1958)

★